క్లుప్తంగా

నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సై

కొండపి: వాహనదారులు నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని సీఐ జి.సోమశేఖర్ హెచ్చరించారు. స్థానిక టంగుటూరు రోడ్డులో హెల్మెట్ వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుందని సూచించారు. వాహనదారులు పత్రాలను తమ వద్ద విధిగా ఉంచుకోవాలన్నారు. ఆటోలు, ట్రాక్టర్లలో పరిమితికి మించి కూలీలు, ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్సై అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

సీఎస్‌పురం(పామూరు): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంతో పాటు 1, 2వ సచివాలయాలను జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మొదట మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వచ్చిన జెడ్పీ సీఈఓ కార్యాలయం రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సచివాలయాలను సందర్శించారు. ఒకటో సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. సచివాలయ రికార్డులు పరిశీలింగ్ మిస్సింగ్ సిటిజన్స్ రిపోర్ట్స్‌పై విచారణ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు, సిబ్బంది బి.రాధాకృష్ణమూర్తి, వై.రంజిత్, పీఎస్‌లు వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సదరం క్యాంపునకు 47 మంది హాజరు



సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్

కొండపి: సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలనకు 47 మంది హాజరైనట్లు హెల్త్ కమ్యూనిటీ వైద్యురాలు వరలక్ష్మి తెలిపారు. జరుగుమల్లి మండలంలోని కామేపల్లి, కె. అగ్రహారం, చతుకుపాడు గ్రామాలకు చెందిన పునః పరిశీలనకు 47 మంది హాజరయ్యారని, ముగ్గురు నోటీసులు కూడా తీసుకోలేదని తెలిపారు. పునఃపరిశీలనలో హాజరైన 47 మందిని రిమ్స్ ప్రత్యేక వైద్యులు కిరణ్ పరీక్షించారు.

సచివాలయ సేవలు సక్రమంగా అందించాలి

పామూరు: ప్రజలకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందించే సేవలను సక్రమంగా అందించాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డీపీఓ జి.వెంకటనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంకోసం వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డీపీఓ మాట్లాడుతూ ఇంటిపన్నులను నూరుశాతం వసూలు చేయాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ కంప్యూటర్‌లో రికార్డులను పరిలించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ బొలినేని సురేష్, ఏఓ ఎస్ చెన్నకేశవరెడ్డి, పీఎస్. జి.అరవిందరెడ్డి, నరసింహారావు, స్రవంతి, సుచరిత, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తు గడువు పెంపు



కనిగిరిరూరల్: కనిగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గౌడ ఉప కులాలకు (గీత కార్మికులకు) మద్యం షాపులు కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కర్‌రావు తెలిపారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. 10న లాటరీ తీస్తారని పేర్కొన్నారు. కనిగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సీఎస్‌పురం, పీసీపల్లి, వెలిగండ్ల మండలాల్లో గీత కార్మికులకు మూడు షాపులు కేటాయించారని, ఆయా మండలాల పరిధిలో ఎక్కడైనా షాపులను పెట్టుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా తెలిపారు. అది నాన్ రీఫండబుల్ అని, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చని వెల్లడించారు. ఫిబ్రవరి 10న డ్రాలో గెలుపొందిన వారికి అదే రోజు షాపులు కేటాయింపు చేస్తామన్నారు. దరఖాస్తుదారుడు తప్పనిసరిగా సప్లమెంటరీ క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకోవాలని తెలిపారు.

పూర్తయినా..ప్రారంభించరా..?

- ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయాలు
- కూటమి ప్రభుత్వంలో సచివాలయాల భవనాలకు గ్రహణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ప్రారంభానికి నోచుకోని వేములపాడు గ్రామ సచివాలయం

హనుమంతునిపాడు:

ప్రభుత్వ సేవలను దగ్గర చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ గ్రామాన ఎన్నో సచివాలయాల భవనాలు నిర్మాణాలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని భవన నిర్మాణాలు పూర్తిగా కాగా..మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ భవన నిర్మాణాలకు గ్రహణం పట్టింది. ఎన్నికలకు ముందు పూర్తయిన భవనాలను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. లక్షల రూపాయల ప్రజా ధనంతో నిర్మించిన ఈ భవన నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎందుకంత కక్ష..?

మండలంలో వేములపాడు, కూటాగుండ్ల, కొండారెడ్డిపల్లి, లింగంగుంట్ల, నందనవనం, ముప్పళ్లపాడు, హనుమంతాపురం గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే వీటిని ప్రారంభించేందుకు ఇంత వరకు అటు కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. దీంతో వేములపాడు, తిమ్మారెడ్డిపల్లి, నందనవనం, సీతారాంపురం, కొండారెడ్డిపల్లి, ముప్పాళ్లపాడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల్లో అరకొర వసతుల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. పెద్దగొల్లపల్లి, లింగంగుంట్ల, హనుమంతాపురం పంచాయతీలో మూత పడిన పాఠశాలల్లో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించకపోవడంతో సిబ్బంది విధి లేని పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితయి నెలకొంది. వాలిచర్ల గ్రామంలో ప్రైవేట్ అద్దె ఇంట్లో సచివాలయ విధులు నిర్వహిస్తున్నారు. చాలీచాలని ఇరుకు గదుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. గ్రామస్తులు సైతం ఈ భవనాలు ప్రారంభిస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సచివాలయ భవన నిర్మాణాలు వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

సమన్వయ ప్రణాళికతోనే పట్టణాభివృద్ధి



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్‌గఫార్

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. స్థానిక ఒకటవ వార్డులోని బొగ్గుల గొంది కాలనీలో బుధవారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పారిశుధ్యం తదితర సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ దశల వారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత ప్రణాళికలో వార్డులోని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

☛ మున్సిపాలిటీలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. స్థానిక చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ అభివృద్ధి ప్రణాళికలు, బడ్జెట్ ప్రణాళికా తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కమిషనర్ డానియల్ జోసఫ్, మేనేజర్ ఇనుపకోళ్ల ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రదీప్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సువర్ణ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, ఏఈ కోటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను ప్రకటించారు. యూత్ విభాగానికి మారంరెడ్డి గంగాధర్, మహిళా విభాగానికి యనమల మాధవి, రైతు విభాగం బొల్లినేని నాగేశ్వరరావు, బీసీ సెల్ యామవరపు వీర వసంతరావు, ఎస్సీ సెల్ చుక్కా కిరణ్‌కుమార్, ఎస్టీ సెల్ దాసు శ్రీనివాసులు, మైనారిటీ సెల్ షేక్ సలీం, క్రిస్టియన్ మైనారిటీ సెల్ మిడసల అశోక్, స్టూడెంట్ వింగ్ పరిటాల సునీల్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగం షేక్ వన్నూరు, ఆర్‌టీఐ దిండు నరశింహం, వలంటీర్స్ వింగ్ పిల్లిపోగు జీవన్‌కుమార్, గ్రీవెన్ సెల్ వింగ్ కొమ్ము ప్రభుదాస్, వాణిజ్య విభాగం గాదంశెట్టి శ్రీరాములు గుప్తా, వీవర్స్ వింగ్ బుర్రా అంకరాజు, వైఎస్సార్‌టీయూసీ ఇనకొల్లు సుబ్బారెడ్డి, అంగన్‌వాడీ వింగ్ గొల్లపూడి సునీత, లీగల్ సెల్ ధారా మాధవరావు, కల్చరల్ వింగ్ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, సోషల్‌మీడియా వింగ్ అనిమిరెడ్డి పెద్దిరెడ్డి, ఐటీ వింగ్ యర్రా రామకృష్ణ, దివ్యాంగుల విభాగం నూకతోటి ఏడుకొండలు, డాక్టర్స్ వింగ్ దావులూరి అంకయ్య, ఇంటలెక్చువల్స్ ఫోరం భువనగిరి సత్యన్నారాయణ, బూత్ కమిటీస్ కొమ్మాలపాటి మదన్‌మోహన్‌రావు, పబ్లిసిటీ వింగ్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డిలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పేదలకు ఉపయోగం లేని బడ్జెట్



టంగుటూరు బొమ్మల సెంటర్లోలో నిరసన చేస్తున్న నాయకులు



కొండపిలో బడ్జెట్ పత్రులు దహనం చేస్తున్న నేతలు

టంగుటూరు: కేంద్ర బడ్జెట్ పేదలకు ఉపయోగం లేదని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్‌లో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ను పరిశీలిస్తే కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉందన్నారు. ఉపాధి పనికి, వ్యవసాయానికి, ఆహార భద్రతకు, నిరుద్యోగ నిర్మూలనకు నిధులు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేసుపోగు మోజెస్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి టి. ప్రభాకర్, రైతు సంఘం నాయకులు టి. నారాయణరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి. సుబ్బారావు, జి.అంకయ్య, ఇత్తడి ఏసుబాబు, పేరాబత్తిన శ్రీను, ఎం. యానాది, కె. శ్రీను, కె. శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.

కొండపి: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ల కోసమే అన్నట్లు ఉందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కేజీ మస్తాన్ అన్నారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి అరకొరగా నిధులు ఇచ్చారన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.2.50 లక్షల కోట్లు కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గుతాయన్నారు. రైతు కూలీ సంఘం నాయకులు చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాలకొండయ్య, సీఐటీయూ నాయకులు రూబేన్, మహిళా సంఘం నాయకురాలు ఆర్ లక్ష్మి, బుజ్జి, ఈశ్వరమ్మ అంగలకుర్తి బ్రహ్మయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శివరాంరెడ్డి, కోటయ్య, ప్రజానాట్యమండలి నాయకులు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టి కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీసీ కేశవరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను నీర్వర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం సవరణలు చేపట్టడం దుర్మార్గమని విమర్శించారు. ఎస్‌కే బషీరా, ప్రసన్న, శాంత కుమారి, యు పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, చెన్నారావు, చిన్నా, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల(కనిగిరిరూరల్): సీఐటీయూ ఆధ్వర్యంలో బడ్జెట్‌పై నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాయళ్ల మాలకొండ, చెన్నారెడ్డి, పాపా కోటిరెడ్డి, జీఎం ఎస్ బాలకృష్ణా, పగడాల చక్రిరావు, గోపాల్ రెడ్డి, మౌలాలి, తిరుపతిరెడ్డి, బాలాజీ, యోహాన పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్స్‌తో పరిజ్ఞానం పెంపు



కనిగిరి ఏబీఆర్ కళాశాలలో ఇండస్ట్రియల్ విజిట్‌లో సీఎస్‌పురం పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు): ఐటీ ఇండస్ట్రియల్ విజిట్‌లు విద్యార్థుల్లో ఆలోచనా పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయని సీఎస్‌పురం పీఎంశ్రీ పాఠశాల(జెడ్పీహెచ్‌ఎస్) హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం, ఐటీ ట్రైనర్ బీవీ రాధాకృష్ణ అన్నారు. సీఎస్‌పురం పీఎంశ్రీ పాఠశాల (జెడ్పీహెచ్‌ఎస్) 9, 10వ తరగతుల విద్యార్థులు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఐటీ ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని కనిగిరి ఏబీఆర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ఐటీ ల్యాబ్‌లను సందర్శించగా ఐటీ ట్రైనర్ రాధాకృష్ణ పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విష్యత్‌లో ఇవి విద్యార్థులకు ఏవిధంగా ఉపయోగకరమవుతాయో వివరించారు.

నేడు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో సమావేశం

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈనెల 6వ తేదీ విపత్తు నిర్వహణపై సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ శుక్రవారం కనుమళ్ల చెరువులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తామని, కావున మాక్‌డ్రిల్ పై అవగాహన కల్పించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



అలకూరపాడు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్

టంగుటూరు: పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ అన్నారు. మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు. 100 రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించి విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలని సూచనలు చేశారు. పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు సొంత నిధులు రూ.50 వేలతో వాలీబాల్ కోర్టులు, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ కోర్టులను ఏర్పాటు చేయడం పట్ల హెచ్‌ఎం, పీడీ వెంకట్రావు క్రీడా కోర్టులు నిర్మాణం మార్కింగ్ చేసిన విధానం పట్ల సంతృప్తిని వ్యక్తం చేసి వారిని అభినందించారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో విద్యార్థులను అభినందించారు. పాఠశాల క్రీడా మైదానానికి 13 సెంట్లు భూమి కొని ఇచ్చిన ఎన్ఆర్ఐ శ్రీనివాసులు, పాఠశాల విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేస్తున్న దాత ఆలం రామారావును అభినందించారు. నాడు నేడు పనులు జరిగిన విధానాన్ని పరిశీలించి ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు ఈ పాఠశాలకు వచ్చిన 18 నెలల కాలంలో ఒక్క సెలవు కూడా పెట్టకపోవడాన్ని చూసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, ఆలకూరపాడుకు వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేసి ప్రధానోపాధ్యాయుడు వి. మురళీకృష్ణ , ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలల వంట గదులను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో కుకింగ్ ఏజెన్సీ వారిని అభినందించారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం చేస్తే సహించం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి

పామూరు: కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ బుధవారం సుందరయ్య భవన్ సెంటర్‌లో సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో యాటా వీరనారాయణ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే.మాల్యాద్రి మాట్లాడుతూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం సవరణలు చేపట్టడం దుర్మార్గపు చర్య అని, దీనివల్ల కార్మికులు తమ హక్కులను కోల్పోవాల్సి వస్తుందన్నారు. హక్కుల సాధన కోసం పోరాటం చేసే పరిస్థితి ఉండదన్నారు. కేంద్ర కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకోకుంటే ఉద్యమాలను ఉధృతం చేసి తగిన గుణపాఠం చెబుతామన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలుచేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ రాయితీ రుణాలు



దరఖాస్తులు పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

హనుమంతునిపాడు: బీసీ కార్పొరేషన్ నుంచి బీసీ, ఈబీసీ, కాపుల కేటగిరిలకు చెందిన వారికి జిల్లా స్థాయిలో 1295 మందికి రూ.46.76 కోట్ల రాయితీ రుణాలు ఇచ్చేందుకు యూనిట్లు మంజూరైనట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, సచివాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రాయితీతో బ్యాంక్ రుణాలు బీసీ కార్పొరేషన్ నుంచి ఇచ్చేందుకు యూనిట్లు మంజూరు చేశామన్నారు. ఈ నెల 7వ తేదీ లోగా అర్హులైన లబ్ధిదారులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఉన్నవారు, కుల ధ్రువీకరణ పత్రాలతో జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఫాం, ఎంఫాఎం విద్యార్హత ఉన్న వారికి జెనరిక్ మెడిక్ షాపు యూనిట్‌కు రూ.8 లక్షలు రుణాలు ఇస్తామని, 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. జెనరిక్ మెడికల్ షాపులు, గొర్రెలు, పాడిగేదెలు, బార్బర్ షాపులు, టైలరింగ్, ఆటోలు, మినీ వ్యాన్, మినీ ట్రక్‌లు, ఇటుకల తయారీ, ట్రాక్టర్, రెండు చక్రాల మెకానిక్ షాపులు, కూరగాయల దుకాణం యూనిట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తారన్నారు. అర్హులందరికీ రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. రుణాలు మంజూరైన వారు తప్పనిసరిగా యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

పశుగణన త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్

సింగరాయకొండ: పశుగణన త్వరగా పూర్తి చేయాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం రవికుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక పశువైద్యశాల ఆవరణలో బుధవారం కొండపి, సింగరాయకొండ, పొన్నలూరు మండలాల పశు సంవర్ధకశాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోనే పశుగణన పూర్తి చేయాలని, పశువులకు సకాలంలో టీకాలు వేయాలని, పశువులు, జీవాలు షెడ్లలో ఉండేలా పశుపోషకులకు అవగాహన కల్పించాలనన్నారు. పశుపోషకులకు ప్రభుత్వం అందించే సబ్సిడీల గురించి వివరించాలని సూచించారు. పశువైద్యులు హజరత్, పేరయ్య, చంద్రశేఖర్, శివరామకృష్ణ, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటల రక్షణ

కనిగిరిరూరల్: సస్యరక్షణ చర్యలతోనే పంటలకు రక్షణ కల్గుతుందని, రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని శాస్త్రవేత్తలు గంగోత్రి, డాక్టర్ పి. రామాంజనేయులు, గౌతమి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో బుధవారం మిరప, నిమ్మ తదితర పంటలను పరిశీలించారు. అనంతరం ఉద్యాన శాఖాధికారి జి. అంజలిభాయి అధ్యక్షతన రైతులకు అవగాహన కల్పించారు. నిమ్మ, మిరప తోటలకు వచ్చే వివిధ రకాల తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కనిగిరి, పామూరు ఉద్యానవన శాఖ అధికారులు అంజలిభాయి, కుసుమ మాట్లాడుతూ ఎస్సీ కేటగిరి వారికి తైవాన్ స్ప్రేయర్లు, చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు 50 శాతం రాయితీ పై అందచేస్తున్నామని, అసక్తి కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సహాయకులు డి. శారద, పర్వీన్, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిపై పిచ్చికుక్క దాడి

కనిగిరిరూరల్: మండల పరిధిలోని కంచరవారిపల్లి స్కూల్ సమీపంలో బుధవారం ఓ విద్యార్థిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వివరాల్లోకి వెళితే..నారపరెడ్డిపల్లికి చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎల్ చరణ్‌తేజ పాఠశాల బయట ఉండగా.. పిచ్చికుక్క ఒక్క సారిగా పైకి దూకి తీవ్రంగా కాట్లు వేసింది. రోడ్డుపై ఉన్న స్థానికులు, ఆటో డ్రైవర్ కుక్కను తరిమారు. అనంతరం ఆటోలో క్షతగాత్రుడైన విద్యార్థి చరణ్ తేజను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు.

పక్వానికి వచ్చిన ఆకులను రెల్వాలి



పొందూరులో రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: పూర్తిగా పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రెల్చి అల్లి బ్యారన్‌లో అమర్చాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రం పరిధిలోని పొందూరులో పొగాకు ఆకు రెల్పులు, క్యూరింగ్, గ్రేడింగ్, పొగాకు బేళ్ల కట్టుట, పొగాకు పంట ఉత్పత్తి, నిర్వహణ, పురుగు మందుల తదితర అంశాలపై బుధవారం బోర్డు క్షేత్ర సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పొగాకు రైతులు పొగాకు అల్లుడు సమయంలో తప్పనిసరిగా టార్పలిన్ పట్టలను వాడటం వల్ల ఇతర అన్య పదార్థాలు రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. పొగాకు తోటల్లో అక్కడక్కడ పొగాకు మల్లె కనిపిస్తుందని, వాటిని తొలగించి దూరంగా తగలబెట్టాలని సూచించారు. క్షేత్రాధికారి ఉపేంద్ర, ఐటీసీ ప్రతినిధి వెంకట్రావు, జీపీఐ ప్రతినిధి శ్రీనవాసరావు, పీఎస్ఎస్ ప్రతినిధి రామాంజనేయులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధన



మాట్లాడుతున్న దేవిరెడ్డి రామిరెడ్డి

వెలిగండ్ల.(కనిగిరిరూరల్): మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుతో ప్రతి తరగతి గదికి ఒక టీచర్ ఉంటారని ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. ఆదర్శపాఠశాల ఆవశ్యకత, కలిగే ఉపయోగాలు తదితర అంశాలపై స్కూల్ కాంప్లెక్స్ కమిటీలకు, తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు మండలంలోని పద్మాపురం పాఠశాలలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మరింత మెరుగైన విద్యా బోధన చేసేందుకు ఉపాధ్యాయులు పనిచేస్తారన్నారు. మోడల్ పాఠశాల వల్ల పిల్లలపై ప్రత్యే శ్రద్ధ ఉంటుందని, ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్య బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దాసు ప్రసాద్, క్లస్టర్ చైర్మన్ ఒంగోలు వెంకటేశ్వర్లు, పీసీ చైర్మన్ శ్రీనివాసులు, హెచ్‌ఎం కిరణ్ పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్దయిర్లపాడు రెవెన్యూ పరిధిలోనే వెంగలాయపల్లి సమీపంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలు స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 652లో 475.57 ఎకరాలను భూసేకరణ జరుగుతుందని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తుందని తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడండి




రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

వెలిగండ్ల.(కనిగిరిరూరల్): మండల పరిషత్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను, రిజిస్టర్‌లను, ఇంటి పన్నుల పంచాయతీల నిర్వహణ, పారిశుధ్య నిధుల, పనుల నిర్వహణ తదితర అంశాలపై అరా తీశారు. అనంతరం మండల పరిషత్ అధికారులు, సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. ఎంపీడీఓ మహబూబ్ బాషా, సీనియర్ అసిస్టెంట్ ఎస్‌కే ఖాదర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

సింగరాయకొండ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పి.పద్మజ అన్నారు. మండలంలోని పాకల, ఊళ్లపాలెంలో జరిగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. డాక్టర్ ధీరేంధర్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ, షేక్ జవహర్ వలీ, రాజేశ్వరి, మస్తానమ్మ, సుచరిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అత్యాల జపన్య

పీసీపల్లి: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అత్యాల జపన్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎక్కడ నీటి సమస్య ఉందో ముందుగానే ప్రతిపాదనలు తయారు చేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులంతా ఈ క్రాప్ చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీటీసీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ త్వరలో జిల్లా పరిషత్ నిధుల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎక్కడ అవసరమో చెబితే బోర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మొద్దపాడు ఎంపీటీసీ మూలే సీతా నారాయణరెడ్డి, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి చెరుకూరి సతీష్, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, టకేరెడ్డి గోపాల్ బొరారెడ్డి పాల్గొన్నారు.